‘పైలట్’లో వంద ఇళ్లు పూర్తి

- కోదాడ నియోజకవర్గంలో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- ఇంటి స్లాబ్ వేసుకున్న180 మంది లబ్ధిదారులకు బిల్లులు జమ
- నిబంధనలు అతిక్రమిస్తే సాయం నగదు నిలిపివేస్తామని అధికారుల హెచ్చరిక


గుడిబండలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ ఇల్లు

కోదాడ : పేదోడి సొంతింటి కళ నెరవేరబోతోంది. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన కోదాడ నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో గల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మోతె మండలంలోని విభళాపురం, నడిగూడెం మండలంలోని కాగితారామచంద్రాపురం, అనంతగిరి మండలంలోని లక్కవరం, చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం, కోదాడ మండలంలోని గుడిబండ, మునగాల మండలంలోని తాడువాయి గ్రామాలు పైలట్ గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికీ వందకి పైగా ఇళ్ల ఫినిషింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో లబ్ధిదారులు గృహ ప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఆరు మండలాల్లో మొత్తం 1001 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 550 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముగ్గు పోయగా 219 ఇళ్లకు స్లాబులు పడ్డాయి. మిగతా ఇళ్లు బేస్‌మెంట్, గోడల నిర్మాణం, స్లాబు లెవల్‌లో ఉన్నాయి. అయితే స్లాబు పూర్తి చేసుకున్న 219 మంది లబ్ధిదారుల్లో 180 మందికి పైగా ఇప్పటికే విడతల వారీగా రూ.4 లక్షల సాయం వరకు సాయం నగదు జమయ్యాయి. కొద్దిమంది లబ్ధిదారులు ప్రభుత్వం నిబంధనల మేరకు 600 అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేపట్టి ఒకటి రెండు బిల్లుల పడ్డాక నిబంధనలు అతిక్రమించి అదనపు గదులు నిర్మించుకుంటున్నారని, అలా నిర్మించుకుంటే వారికి మిగిలిన బిల్లులను నిలిపివేస్తామని అధికారులు చెబుతున్నారు.

వెబ్‌సైట్‌లో బిల్లుల వివరాలు..

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది. ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్, రూఫ్ లెవల్, స్లాబ్ దశలు పూర్తయిన వారం లేదా రెండు వారాల తర్వాత బిల్లులు పడకుంటే ఎందుకు పడలేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం indirammaindlu.telangana.gov.in వైబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో లబ్ధిదారులు వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి ఆధార్, ఫోన్, రేషన్ కార్డు నంబర్లు లేదా తమ అప్లికేషన్ ఐడీ నంబర్‌ను ఎంటర్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఒక వేళ బిల్లులు పడకపోతే ఎక్కడ ఆగిందనే స్టేటస్ చూపిస్తుంది. బిల్లుల పడని లబ్ధిదారులు ఫిర్యాదు చేసేందుకు 1800 599 5991 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం మాకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటున్న. ఇంటి స్లాబ్ పూర్తయింది. సొంతిల్లు నిర్మించుకోవడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు చేసిన మేలు మరిచిపోం.

– మర్ల ఉప్పమ్మ, కాగితరామచంద్రాపురం

నిబంధనలు అతిక్రమిస్తే బిల్లులు రావు



ఇందిరమ్మ ఇంటి బిల్లులు మంజూరు చేయిస్తామని ఎవరైన డబ్బులు అడిగితే ఇవ్వొద్దు. కొందరు లబ్ధిదారులు ఒకటి, రెండ్లు బిల్లులు ఖాతాలో జమయ్యాక అదనపు గదులు నిర్మించుకుంటున్నారని తెలిసింది. అలా నిర్మించుకుంటే బిల్లులు రావు.

– జేఎస్‌ఎన్ మూర్తి, హౌసింగ్ ఏఈ, కోదాడ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- ఎస్పీ నరసింహ


మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

మునగాల: మునగాల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయరహదారి ఎక్కువ విస్తరించి ఉన్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ నరసింహ సూచించారు. మంగళవారం ఆయన మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. తొలుత మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి గౌరవవందనం తో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. సర్కిల్ పరిధిలో గల పోలీసుస్టేషన్లలో నిర్వహిస్తున్న రికార్డులు,కోర్టు విధులు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. కార్యాలయంలో రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. రికార్డులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సమష్టిగా పనిచేయాలని సూచించారు. రోడ్డు భద్రత, సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సర్కిల్ పరిధిలో గల మునగాల, నడిగూడెం, మోతె పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, అజయ్‌కుమార్, అజయ్, డీఎస్ఆర్బీ ఎస్ఐ యాకూబ్, ఏఎస్ఐ అంజన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్‌రెడ్డి , సీసీ సందీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెండె స్వరాజ్యం (65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మృతుని భార్య గుర్వమ్మ ఐదేళ్ల కిందట మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగుల వీరాంజనేయులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ నాయకులు మారిశెట్టి నర్సింహారావు, ఈద వెంకటరెడ్డి, యాదవ సంఘం నాయకులు గంధం కోటయ్య, మునగ గోవిందు, మెండె శ్రీను, కట్టెబోయిన కట్టయ్య, రాజుల గురుస్వామి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌నాయక్

హుజూర్‌నగర్ : క్షయ అనుమానితులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ సూచించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఉచిత ఛాతి ఎక్స్‌రే శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్షయ రహిత సమాజం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీప్రియ, డాక్టర్ అష్రఫ్, సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్ఎన్ఓ నూర్జహాన్ బేగం, టీబీ కోఆర్డినేటర్ ప్రసాద్, మాధవరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, లలిత, మాధవి, ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ మమత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్


పాల్గొన్న నాయకులు

మునగాల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని మండల పరిధిలోని వెంకట్రాంపురంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైలారిశెట్టి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి సీహెచ్.జ్యోతి, నాయకులు దొంగరి నాగజ్యోతి, సీనియర్ నాయకులు రణబోతు శ్రీనివాసరెడ్డి, వీరబోయిన వినోద్, రెడ్డిపల్లి సైదులు, గుండు ప్రకాష్, దొంగరి సత్యం, పాల్గొన్నారు.

మోష మృతి బాధాకరం

నడిగూడెం : మహాజన సోషలిస్టు పార్టీ నడిగూడెం మండల అధ్యక్షుడు మిట్టగణుల మోష (53) అకాల మృతి బాధాకరమని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం చాకిరాలలో మోష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇంచార్జి బచ్చలకూడి వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు, రాష్ట్ర నాయకులు యలమర్తి రాము, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య


ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ రేవతి

గరిడేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్య అందిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం మండలంలోని గానుగబండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పిల్లలు ఆటలు ఆడుకోవడానికి స్థానికంగా దొరికే బొమ్మలతో పాటు స్వదేశీ బొమ్మలు ఎలా తయారీ చేయాలో చేసి చూపించారు. పోషకాహారం తయారీకి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ యానాల రాజేష్, టీచర్లు పోకల వెంకమ్మ, సత్యవత, జంగం అనిత, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : నేరేడుచర్ల పట్టణానికి చెందిన లబ్ధిదారుడు ఎస్‌కె సమీర్ బాబాకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ పాండునాయక్, ప్రధాన కార్యదర్శి జంగిలి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాలవ్వాయి కృష్ణమూర్తి, చింతమళ్ల సైదులు, లక్ష్మయ్య, జాను తదితరులు ఉన్నారు.

లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి

గరిడేపల్లి : హుజూర్‌నగర్‌లో ఈ నెల 26న నిర్వహించబోయే లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని లంబాడీ జేఏసీ మండల నాయకులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. లంబాడీ విద్యార్థి నాయకులు, ఉద్యోగ సంఘం నాయకులు అన్ని కుల సంఘాల నాయకులు, మహిళలు ఈర్యాలీలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో లంబాడీ జేఏసీ నాయకులు గుగులోతు కృష్ణ, వీటీనాయక్, నాగరాజు, శ్రీను, బాబు, సైదా, వెంకటేశ్వర్లు, రాములు, రామకోటి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో లేబర్ కార్యాలయం ముట్టడి


లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కోదాడ : భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జీఓ నంబర్ 12ను సవరించి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కోదాడ పట్టణంలోని లేబర్ ఆఫీస్‌ను భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కంపెనీలకు అక్రమంగా ఇచ్చిన రూ.346.36 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలన్నారు. కార్మికుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు, సహజ మరణానికి రూ.2 లక్షలు అందజేయాలన్నారు. అనంతరం ఆఫీస్ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాలాజీ నాయక్, నాగలక్ష్మి, రవీందర్ తదితరులు ఉన్నారు.

అభినవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


మేకల అభినవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడ : క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన చెస్ క్రీడాకారుడు మేకల అభినవ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పట్టణ ప్రముఖులు అన్నారు. మంగళవారం అభినవ్ 24వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ క్రీడలో రాణిస్తూ కోదాడ పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అభినవ్ చిన్నవయస్సులోనే మృతి చెందడం బాధాకరమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడారంగంలో రాణించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, మేకల వెంకటేశ్వర్లు, అరుణ, పార సీతయ్య, పైడిమర్రి సత్తిబాబు, రావెళ్ల సీత రామయ్య తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకానికి ఎంపికై న 150 మంది మహిళ సభ్యులకు మంగళవారం కోదాడ పట్టణంలోని సంఘ బంధ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పెరటి కోళ్ల పెంపకం ఎలా చేపట్టాలి, వాటికి కావాల్సిన దాణ తయారీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్కెటింగ్‌పై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకన్న, సీసీలు పరిమళ, చిన్నా, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంతోనే తండాల అభివృద్ధి


మాట్లాడుతున్న ఒంటెద్దు నరసింహారెడ్డి

మఠంపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని గిరిజన తండాల అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బీల్యానాయక్‌తండాలో జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పొలాల్లో ఉండాల్సిన రైతులు కార్యాలయాల చుట్టూ కట్ట యూరియా కోసం తిరుగుతున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల స్థానికంగా అనారోగ్యంతో మృతిచెందిన కార్యకర్త దీప్లా కుటుంబానికి ఒంటెద్దు నరసింహారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, సునీతాలాలునాయక్, లక్ష్మీనరసింహరాజు, నాయకలు లక్ష్మీనరసింహారెడ్డి, కోటానాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో డాక్టర్లు, సిబ్బంది, ప్రజలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన రుగ్మతలపై వైద్యురాలు నిత్యా సంతోషిని రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ.. వినికిడి సమస్య, చెవిలో నుంచి చీము, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే చికిత్స చేయించుకోవాలన్నారు. శిబిరంలో 60 మందికి స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 26న స్త్రీలకు సంబంధించిన వైద్యులు వస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్.అంజయ్యగౌడ్, యశోద, కవిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించి.. డంపింగ్ యార్డుకు తరలించి

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని రామస్వామి గుట్టపైన, గుట్ట కింద, మెట్లపై చెత్తను, పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. చెత్తను ఎత్తి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, సీఓ అక్రమ్‌బాబా, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.


రామస్వామి గుట్టపై శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది

ఘనంగా బతుకమ్మ వేడుకలు


కోదాడ : కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న జడ్జి, మహిళా న్యాయవాదులు


కోదాడ : బతుకమ్మతో జడ్జి భవ్య


హుజూర్‌నగర్ : మూడో వార్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మేళ్లచెరువు : దొండపాడులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

కోదాడ : కోదాడ పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను మహిళా జడ్జిలు, న్యాయవాదులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, జూనిర్ జడ్జిలు ఉమర్, జాకీయా సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలో బతుకమ్మ వేడుకలను మహిళలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఒకచోట చేర్చి గౌరీ పూజ చేశారు. బతుకమ్మల చుట్టూ మహిళలు చప్పట్లు వేస్తూ ఆడిపాడారు. అనంతరం వాటిని నీటిలో నిమజ్జనం చేశారు.

దొండపాడులో..

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని దొండపాడులో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఒక చోట చేరి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ఆధిక మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

కండువా కడితేనే యూరియా


మేళ్లచెరువు : యూరియా కోసం క్యూలైన్ గ్రిల్స్‌కు కండువాలు కట్టి ఉంచిన రైతులు

మేళ్లచెరువు : యూరియా కోసం రైతులు పీఏసీఎస్‌ల వద్ద క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడలేక చెప్పులు, ఆధార్‌కార్డుల జీరాక్స్‌లు ఉంచి నిరీక్షించడం చూశాం. కానీ మేళ్లచెరువులో రైతులు వినూత్నంగా ఆలోచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే వారి కండువాలను క్యూలైన్ గ్రిల్స్‌కు కట్టి ఉంచి తమవంతు వచ్చేవరకు నిరీక్షించి ఒక్కొక్కరు రెండు బస్తాల యూరియా పొందారు.

యూరియా కోసం ఎగబడిన రైతులు

కోదాడ : చిలుకూరు పీఏసీఎస్ పరిధిలోని ఆర్లెగూడెం గోదాముకు మంగళవారం యూరియా బస్తాలు దిగుమతి అయ్యాయని తెలవడంతో రైతులు ఉదయం 6 గంటలకే పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జీరాక్స్‌లతో ఎడబడ్డారు. గంటల తరబడి నిరీక్షిస్తే ఒక్కో బస్తా యూరియా లభించింది.

నేటి నుంచి కబడ్డీ పోటీలు, బతుకమ్మ సంబరాలు

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో ఈ నెల 24 నుంచి నిర్వహించబోయే కబడ్డీ పోటీలు, బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు రజిత కోరారు. మంగళవారం మండలంలోని వెలిదండలో జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మేకల ధనమ్మ, గండు విజయకుమారి, అలవాల రాజేశ్వరి, ఎలుగురి కోటమ్మ, చనగాని సూరమ్మ, ఎల్లమ్మ, మంగమ్మ, బేబి, సరస్వతి, ఆదిలక్ష్మి, నాగేంద్ర, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల నర్సరీని స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో అగ్రికల్చర్ వృత్తివిద్య కోర్సు చదువుతున్న విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో షెడ్‌నెట్, బెడ్లను విద్యార్థులు పరిశీలించారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రయోగపూర్వక పరిజ్ఞానం అందించేందుకు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రసన్నకుమారి, ట్రైనర్ టి. శ్రీను తెలిపారు.

గాయత్రీ దేవి అవతారంలో కనకదుర్గమ్మ


హుజూర్‌నగర్ : మూడో వార్డులో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు


హుజూర్‌నగర్ : నేరేడుచర్ల పట్టణంలోని శ్రీవిజయదుర్గ ఆలయంలో..


మేళ్లచెరువు : గుడిమల్కాపురంలో గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు


హుజూర్‌నగర్ : సీతారాంనగర్‌లో..


గరిడేపల్లి : కీతవారిగూడెంలో..


హుజూర్‌నగర్ : సాయిబాబా థియేటర్ రోడ్డులో..


కోదాడ : బ్రహ్మంగారి ఆలయంలో..